# తారుమారు!

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

తీరా వాకిట్లోకి వెళ్ళేటప్పటికి తలుపు కాస్త తాళం వేసివుంది. రామనాథం కస్సుమన్నాడు తల్లిమీద. శాంతమ్మకు యేటూ మాట్లాడటానికి తోచలేదు. శారద మాత్రం అతితీవ్రంగా ఆలోచిస్తోంది. ఎండమాడ్చేస్తోంది పదిగంటలకే. నిండు వేసంగిలో ముహూర్తం కుదిరింది పెళ్లికూతుర్ని చూడటానికి.

ఎన్ని సంబంధాలువచ్చినా రామనాథానికి మాత్రం ఒకటే సమాధానం తట్టుతూ వచ్చింది. చదువు పూర్తికానిదే పెళ్లి చేసుకోనంటూ. ఆ అడ్డం తీరిపోగానే తల్లి కాస్త పీకెమీద కూర్చుంది, ఎవరినో వకర్ని కట్టుకోమంటూ. కందకులేని దురద కత్తిపీటకు యెందుకో! రామనాథం కాస్త సమాధానం వెతుక్కోటంవరకు వచ్చేటప్పటికి శాంతమ్మకు మంచి అవకాశం దొరికింది. శారద మాత్రం అన్నయ్యతో పాటు సంబంధాలు చూడటానికి వెళ్ళాలనే సరదాలోనేవుంది. ఇక రామనాథానికి యిల్లు కదలటం తప్పనిసరి అయింది.

మగవాడు తనకేమని అతనిధీమ. చదువుకున్న ఆడదాన్ని చేసుకోవాలనే నవీన మోజు అతన్నికూడా పట్టుకు పీడించపట్టే యెన్నో సంబంధాలకు స్వస్తిచెప్పి యీనాడు యీ పట్ట భద్రురాల్ని చూడటానికి వచ్చాడు. అడుగులోనే హంసపాదమన్నట్లు తీరా వాకిట్లోకి వెళ్ళేటప్పటికి తలుపు కాస్త తాళంవేసివుంది.

కింకర్తవ్యం అనే ప్రశ్న యీ ముగ్గుర్ని అయిదు నిమిషాలవరకు మౌనంలో ముంచేసింది. 'ఇరుగుపొరుగు అంటారు. కాస్త ప్రక్కింటి వాళ్లింటికివెళ్లి అడుగుదాంరా. ఈ కాస్తలో మనగౌరవానికి యేమీలోటు రాదులే నాయనా' అన్నది శాంతమ్మ. శారద ముఖం చిటచిటలాడించింది. రామనాథం అక్కసుపట్టలేకపోతున్నాడు.

'మనం సంబంధము చూడటానికి వచ్చామని మాత్రం వాళ్లతో చెప్పక్కర్లేదు' అంటూ యేసవరణ లేకుండానే ఒక తీర్మానం చేసుకుని అవతల యింటివైపుకు కాలు కదిపారు. శారద మాత్రం 'యెవరని అడుగుతే ఏంచెప్పుదాం' అన్నది అతిభయంగా.

ఏదో చెప్పుదాంలే అంటూ ఒక్క విదిలింపు విదిలించేశాడు రామనాథం. శారద వుక్కిరి బిక్కిరి అయింది.! శాంతమ్మ రామనాథంవైపుకు చూసింది.

ఈ క్రొత్త ముఖాలన్ని చూసేటప్పటికి రంగారావు ప్రాణం నిలువునా యెగిరి పోయింది. అపరాహ్ణంవేళ అనాయాచితంగా అతిథులువస్తే అన్నంపెట్టాలనే ఆవేదనకంటె అతనిలో యింకేంలేదు. రంగమ్మ రండి లోపలకు అంటూ ఆదరించింది.

మగవాడు మొద్దులాగ కుర్చీలో కూర్చునివుంటే ఆడది రమ్మని ఆహ్వానించటం అనేది రామనాథానికి చాల కటువనిపించింది. శాంతమ్మ, శారదలు మాత్రం ఏభావం లేకుండానే చేటంత ముఖం చేసుకుని లోపలకు వెళ్ళారు.

రామనాథానికి తనను తానే పరిచయం చేసుకోవటం యిదే ప్రథమం.

'కామేశ్వరరావుగారు మా బంధువు. వారింటికి వచ్చాము. కాని ... అంటూ యేదో టూకీగా ప్రారంభించాడు. శాంతమ్మ ముసిముసి నవ్వులు శారద పల్లికిలించటం కొంతవరకు రంగమ్మ చూసిందేమోనని రామనాథం కొంచెం భయపడ్డాడు.

'ముందర భోజనాలు కానీండి. తర్వాత మాట్లాడుకోవచ్చు!' అంటూ రంగారావు హఠాత్తుగా వాకిట్లోకివచ్చాడు. ఆయనకు ఆదరణ చాలా ఎక్కువ. ఆ సమయానికి వచ్చినవాళ్లకు భోజనాలు పెట్టాలనేదే ఆయన సిద్ధాంతం. ఎవరూకూడా ! కాదని గెలవలేదు.

తాపీగా సావిట్లోకూర్చున్నారు. బాతాఖానీ మహోత్సవానికి రంగమ్మ ప్రారంభోత్సవము చేసింది.

'వియ్యాలవారిల్లు యిదేలాగవుంది.వచ్చినందుకు యీ అమ్మాయి సంగతి యేదైనా తేల్చుకుంటేరామనాథాన్ని ఒకయింటివాన్ని చేసినవాళ్లం అవుతాం' అనుకుంది. లోపల దూరంగా గదిలో వోరవాకిలిగావున్న తలుపు ప్రక్కనుంచి తొంగిచూస్తున్న ఒక అమ్మాయినిచూసి శాంతమ్మ.

రామనాథం యింట్లో అడుగు పెట్టంగానే చూసింది.

ఆ అమ్మాయినే!

...'ఇట్లా వుండండి మా పరిస్థితి. ఈ కట్నాల రోజుల్లో యీ అమ్మాయికి ఆ మూడుముళ్లు యెట్లా పడతాయో-సామాన్య కుటుంబీకులం' అంటూ రాత్రింబగళ్లు ఒకటే మధనపడిపోతున్నాం అన్నది రంగమ్మ.

రామనాథం మనస్సులో యేమిదూరిందో భగవంతునికెరుక. 'ఏమన్నా చదువుకున్నదా అండి' అన్నాడు రామనాథం, నదురుబెదురులేకుండా. అట్లా అడగటం శాంతమ్మకు చాలా ఆశ్చర్యంవేసింది.

రంగారావు కూతురి సంబంధం విషయము యెవరు చర్చించుకున్నా అక్కడ హాజరు అవుతూ వుంటాడు. ఆయనకు

ఆ అమ్మాయిపెళ్లి యెట్లా చేస్తానా అనే ఆదుర్దాయే యెక్కువవుతున్నా తన ఆస్తి అంతా వచ్చేపోయేవాళ్లకు విస్తళ్లు వెయ్యటంతోనే అయిపోతోంది.

'చదువుకోక పోవటమేమిటి? ప్రయివేటుగా ఇంటర్మీడియట్ చదువుతోంది. మా అమ్మాయి ఫస్టుక్లాసులో మెట్రిక్యులేషన్ ప్యాసయింది' అంటూ గదిలోకివెళ్లి సర్టిఫికెట్టు తీసుకువచ్చాడు. ఆయన యితరుల చదువుల గురించి సర్టిఫికెట్టు చూడనిదే నమ్మడు.

రామనాథం ఏవో యింకా వివరాలు రంగారావును అడుగుతుంటే శాంతమ్మ, రంగమ్మ ప్రశ్నలకు సమాధానాలు చెపుతోంది. శారదకు మాత్రం యేమీ తోచటంలేదు.

'అమ్మా'! వాళ్లు యెప్పుడు వస్తారనిమనం ఆగుతాము' అన్నది మెల్లిగా తల్లితో శారద.

శాంతమ్మ, 'ఏమండీ'! అంటూయేదో అడగబోతుంటే రామనాథం అందుకుని, ఈ కామేశ్వరరావుగారు యెప్పుడు వస్తారండీ' అన్నాడు. రంగారావు యేదో సమాధానం చెప్పబోతుంటే రంగమ్మ అందుకుని 'వాళ్ల అమ్మాయి వరున్ని చూడటానికి వెళ్లింది. ఎవరో వెంకట్రామయ్యగారి అబ్బాయిట, బాగా చదువుకున్నవాడుట. ఆ అబ్బాయి చదువుకున్న పిల్లనే చేసుకుంటానని ఒక దీక్ష పట్టాడుట. ఆ అబ్బాయివచ్చి నన్ను చూసేదేమిటి? నేనే వెళ్లి ఆ అబ్బాయిని చూసివస్తాను అంటూ బయలుదేరింది ఆ సుజాత. ఆ అమ్మాయి మహా ...'అని నాలిక కరుచుకుని సగంలో ఆపేసింది.

శాంతమ్మ గ్రుడ్లు పెద్దవిచేసింది. శారద ఆశ్చర్యంగా చూసింది.

రామనాథం ఎదురుకుండావున్న గది వైపుకుచూస్తూ చిరునవ్వుతో ఏంఫరవాలేదన్నట్లు తలవూపాడు.

రంగారావు అర్ధంచేసుకున్నట్లు రంగమ్మ వైపుకు చూశాడు.

